# మను చరిత్ర +

రచన :
మాస్టర్ రవి, రాజాం.

తెల్లటి డ్రెస్ టక్ చేసి, రోజూ సాయంత్రం అయిదు గంటలకు వాహ్యాళికి వెళ్లే రంగ - అంటే మనోరమకు పంచ ప్రాణాలని, తెలిసేసరికి, స్వామి తృళ్ళి పడ్డాడు.

పడ్డాడంటే పడడు మరి! ప్రేమ - అంటేనే ఆరడుగుల హై జంప్ చేసి, థబేల్న క్రింద పడబోయి, దగ్గరగా వున్న పక్కమీద పవ్వళించి - 'ఛి ఛ్ఛి ఛ్ఛి... నాకు చెప్పకిలాంటి విషయాలు. ప్రేమ... పెళ్ళి... ఈ భూప్రపంచంలో ప్రేమించుకోవటం - తర్వాత ఎలాగో లాగ తంటాలుపడి పెళ్ళిచేసుకోవడం...... ఇంతేనా?... ఇంకేం లేదూ? మరీ మన సాహిత్యం ఈ పిచ్చి ప్రేమతో నిండిపోయి, పిటపిటలాడే అమ్మాయిల్ని, మరీ అమాయకుల్ని చేసి, పాడుచేస్తోంది...'' అని ఆయాసపడిపోతూ, అరగంట ఎత్తున బాధపడి, చీదరించుకునే రంగ సంగతే పూర్తిగా తెలుసుకోకుండా, మనోరమ ప్రేమించిందంటే, ఆఖర్న ఆమెకు అపజయం ఖాయమనే సంగతి చెప్పకనే తెలిసిపోయింది స్వామికి.

స్వామి - రంగ, ప్రియ స్నేహితులు. స్వామికి ఎప్పుడూ అందంగావుండే అమ్మాయిల సంగతే కావాలి. రంగకి అదంటేనే వళ్ళు మంట. అయినా, ఉత్తర దక్షిణ ధృవాలవంటి ఈ అబ్బాయిలిద్దరూ స్నేహితులెలా అయ్యారో... ఆశ్చర్యమే మరి !

ఓ రోజు మనోరమ... అసలు మనోరమ తాశీల్దారుగారి అమ్మాయి. ఆమె ఎప్పుడూ రెండు జళ్లేసుకోవటం, లోన తెల్ల కట్ బాడీ వేసుకుని, నైలాన్ జాకెట్టు తొడుక్కోవటం; షిఫాన్ చీరలు తప్ప సాదా చీరలు వాడకపోవడం; తన విశాలమైన కళ్ళతో యువ హృదయాలను అల్లరి పాల్చేయడం; వచ్చిన కొత్త సినిమాలో వుండే ప్రేమ పాటల్ని - పాఠాల్ని వెంటనే కంఠతా పెట్టేసి, అబ్బాయిల్తో మాట్లాడుతూన్నప్పుడు అప్పచెప్పేయటం, ముఖ్యంగా బాటసారిలో 'కృతి చేసి నావూ ఈ మూగ వీణా' అంటూ గొణుగుతూండటం ఇవన్నీ బాగా హాబీ. ఇంతకన్నా ముఖ్యమైన సరదా ఏవిటంటే: ఇష్టమైతే అబ్బాయికి హృదయమే ఇచ్చేయటం, లేకపోతే వాణ్ని ఏడిపించుకు తినటం ఇన్ని చక్కని లక్షణాలున్న మనోరమ, రంగని చూడగానే ఇట్టే ఐసైపోయిందంటే రంగలో ఏదో విచిత్రమైన ఆకర్షణే వుండాలి.

నిజం చెప్పాలొస్తే, నిష్కర్షగానే మాటాడాలి. రంగ మాత్రం అబ్బో బలే గుం(ట)టాడు. తెల్లగా పొడుగ్గా, ఇస్త్రీ నలగని తెల్లటి వైట్ డ్రిల్ డ్రెస్; మెడ మీద కాస్త తేనె రంగు పుట్టు మచ్చ, ఆడపిల్ల కళ్ళకంటే అందమైన పెద్ద కళ్లు పూర్వాశ్రమంలో. ఎందరో అబ్బాయిలే అతన్ని ప్రేమించేశారట. (అదేమో నాకు తెలీదు. అతనే చెప్పాడు. నా కల్పన ఏఁవీలే దిందులో!) అతని పెదిమలు బలేగుంటాయ్. లిఫ్స్టిక్ రాసుకునే అమ్మాయి పెదిమల్లా. అతను బియస్సీ అగ్రికల్చర్ అయి, ప్రస్తుతం విశ్రాంతిగా గాలి పీలుస్తూ; ప్రేమ విషయాలు తప్ప ఇతర విషయాలన్నీ కూలంకషంగా, రీసెర్చి చేస్తూ, అమ్మాయిలు కనబడితే, అరమైలునుండీ బుర్ర వంచేసుకుని, వూపిరి బిగబట్టి వీలునుబట్టి ఆంజనేయ దండకం చదువుతూ వుంటాడు.

రంగ అందమైన వాళ్ళలోనే జమ. అయితే, అతనికి తను వత్తి 'శాంగ'లా వుంటాననే బాధ - భయంఎక్కువ. స్వామి ఎన్నోసార్లు చెప్పాడు కూడా.-'రంగా! నువ్వు చాలా బాఁవుంటావయ్యా! నీకేం తక్కువ?... మరో సంగతి... నిన్ను సునిల్ దత్'గా హృదయంలో స్థానమిచ్చేసిన అమ్మాయిలు కూడా వున్నారు. వివరాలింకా నాకు పూర్తిగా తెలీఁవనుకో ఓ కాఫీ పోయిస్తే, ఎంక్వయరీ చేసి, డిటెయిల్స్ చెప్తాను...' అని.

విచిత్రమేమిటంటే, రంగకి కాఫీ అంటే అసలు పడదు. అతనికి పాలంటే (కోపాలో - తాపాలో... పాపాలు మాత్రం కాదు-) బలే ఇష్టంట! హోటలుకు కూడా వెళ్ళే అలవాటు లేదు. వెళ్తేమాత్రం తక్కువ పట్టుపట్టడు. ఉప్మా పెసరట్టు. పకోడా, వుంటే సేమియా పులావ్... తర్వాత బ్రేవ్,.. ఆఖర్న చక్కటి పా...లు... అంచేత అతన్నెవరూ ఆ ఛాయలకు రానివ్వరు. ఇది రంగగూర్చి సంక్షిప్తసమాచారం. అయితే, రంగంటే, మనోరమకు బాగా 'లవ్'అని మొట మొదటి



సారిగా, స్వామి, అతని ప్రియసోదరి వైదేహిద్వారా విన్నాడు.

మగాళ్ళు ఎలాఅయితే కలుసుకున్నప్పుడు, లోకాభిరామాయణాలు, లవ్‌లు, ఫ్రెండ్‌లు...ఇత్యాదివన్నీ మాట్లాడుకుంటారో...అలాగే ఆడాళ్ళున్నూ...

వైదేహి, మనోరమ బాగా స్నేహితులు

ఓరోజు మనోరమ, వైదేహితో-'ఏఁవేఁ...మీ అన్న సార్వభౌములతో తిరిగే ఆ టక్ కుర్రాడెవరేఁ...' అని అడిగిందిట.

వైదేహి, నిజం చెప్పకేం...కాస్త అమాయకురాలు 'కనుక్కొని చెప్తా'-నంది.

'ఏఁవేఁవే! కొంపదీసి, నేనడిగానని అడుగుతాఁవేఁవిటి? బాఁవుండదు...అదికాదుకానీ ఆ అబ్బాయి బలేగా గమ్మత్తుగా వుంటాడుకదూ అతన్ని చూస్తే మదరిండియా సునిల్‌దత్ జ్ఞాపకానికొస్తాడే...'

'మదరిండియా సునిల్‌దత్తేఁవిటి? అందులో వాడు అచ్చంగా బరంపురం కొండముచ్చులా వుంటాడు. ఇతనూ అలా వుంటాడనా...' విట్ వేసింది వైదేహి.

'ఛ...పూరోక్కి...ఎవరేనా వింటే ఏఁవనుకుంటారు? నీకు సునిల్‌దత్ ఎవరో బాగా తెలియాలని, మనం కలిసి వెళ్ళిన సినీమా పేరు చెప్పానుగాని, అందులోలా వుంటాడనా దానర్థం? అతనికేఁవే? రాజులా వుంటాడు. అతని కళ్ళకే ఇవ్వొచ్చు ఎంతైనా...' అర్థోక్తిలో ఆగిపోయిన మనోరమని ఇట్టే గ్రహించేసింది వైదేహి. వాళ్ళిద్దరూ కలుసుకున్నప్పుడు రంగ సంగతే మాట్లాడుకుంటార్ట.

ఈ వివరాలన్నీ వినే స్వామి బిత్తపోయాడు.

ఓ అందమైన అమ్మాయి, ఓ చక్కని అబ్బాయి కోసం, అలా పాపం విలవిల్లాడిపోతూ, విరహాన్ని అనుభవించేస్తూంటే, ఎవరికైనా కష్టంగానే వుంటుందిమరి. అందులోనూ మనోరమ అందని మకరందమాయె!

అందమైన అమ్మాయి, అబ్బాయికోసం: గాలికెగిరే డోర్ కర్టెన్స్ సందునుండి, ఆకాశాన్నంటే డాబాల మీంచి, వీలుండివుంటే కిటికీ కటకటాల్లోంచి...చూస్తూ...కళ్ళతో అతనికి సందేశాలిస్తూంటే, ఇతను అంటే ఈ అబ్బాయి ఊ మరీ బిగుసుక్కూచోటం, పాపానికి దారితీసుందేమోని ఎంచి, ఆ మనోరమగూర్చి, ఈ రంగకు కొంగ కలుగజేసి; వారి సుఖాంతాన్ని చూద్దామని, నిర్ణయించుకున్నాడు స్వామి. స్వామి సహృదయుడు మరి పాపం!!

* * *

'ఒరేయ్! ఓ అందమైన అమ్మాయి నిన్నుచూసి—' రంగాగారూ! మీరు చాలా అందంగా వుంటారండీ! మీకు పెళ్ళయిందా...మీ కళ్ళు నా ఒళ్లు జలదరింపచేస్తున్నాయండీ — అంటూ ఇంకేమేమో అందనుకో... దాన్నిబట్టి నువ్వేం గ్రహిస్తావ్?' షికారు టైంలో అగిగాడు రంగని, స్వామి.

'అబ్బే! ఏదో మామూలుగా అడిగిందనుకుంటాను...' తేల్చేశాడు రంగ పెద్ద వేదాంతిలా.

'ఓరి చవటా...అది కాదురా సంగతి...అందుకేనువ్వు పాతరాతియుగంలో పుట్టబోయి, నా ఖర్మ కాలి, నా పక్కన పుట్టావ్. వయసులో వున్న అమ్మాయి అనే ప్రతి మాటా, ఏదో భావంతోనే అంటుందని గ్రహించు, కానీ తప్పులో మాత్రం కాలెయ్యగూడదు. అలా... అలా...అన్నీ విని కొంతకాలం సాగేక, కన్‌ఫర్మ్ చెయ్యాలి. తొందరపడితే గందరగోళమే! అన్న ప్రతి మాటలోనూ అర్థముందని, తెలివితేట లుపయోగిస్తే, ఆవిడ జోడు న్యూత్ తెల్సుకోవల్సి వస్తుంది...దీనికి కాస్త సైకాలజీ స్టడీ కావాల్రా బ్రదర్. మరో సంగతి చూడు...అమ్మాయి మాట్లాడుతున్నప్పుడు, ముఖంలో మారే రంగులు చదవడం నేర్చుకోవాలి నునం దగ్గరగా వున్నప్పుడు ఎలా బిహేవ్ చేస్తోందో, ఏఁవేం పాటలు (ఓ బాటసారీ ననూమరువకోయీ; నాలోని మధుర ప్రేమా...; ఇత్యాది టైపు...) పాడుతోందో; కళ్ళల్లోకి కళ్లుపెట్టి చూస్తోందో లేదో, ఇవన్నీ కూలంకషంగా తెలుసుకుని, అప్పుడు ఓ నిర్ణయానికి రావాలి. కొంతమంది అమ్మాయిలు, తమ భావాల్ని, ఉద్దేశాల్ని, పక్కనుండే చెలికత్తెలతోటి; చిన్నపిల్లలతోటి వివరిస్తారు, తద్వారానూ గ్రహించవచ్చు. అలా గ్రహించిన గ్రహింపే - నీ - ఈ ప్రేమకథా సంగ్రహం...ఒరేయ్ నిన్ను మనోరమ ప్రేమిస్తోంద్రా...ఆమెకు ఆ బిక్షా ప్రదానం చెయ్యరా...ఓ బంగారు బొమ్మ (అపిల్ల కాస్త చామన ఛాయ అయినా) కొమ్మమీది చిలకమ్మలా, నీ

(తరువాయి 24వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

కోసం అలా విలవిల్లాడిపోతూంటే, చూసీచూడనట్టూరుకోడం ధర్మం కాదు...' సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు స్వామి, తన అనుభవాన్ని, పుస్తకపఠనా సారాంశాన్నీ క్రోడీకరించి.

రంగ చిన్న చిరునవ్వు నవ్వి, స్వామి దగ్గరగా వచ్చి- 'నిజంగానే నంటావా...?' బోల్డు సిగ్గుతో నుగ్గైపోయి అడిగాడు రహస్యంగా.

స్వామి మనస్సులో ఆనందించాడు, కుర్రాడు దార్లో పడుతున్నందుకు.

'నిజంగాన్రా...అమ్మతోడు...లేపోతే సరస్వతోడు నీతో అబద్ధాలాడతాను? వివరాలు చెప్పాను, ఆ పైన నీ యిష్టం' తక్కున తెంపేశాడు స్వామి.

రంగ రకరకాల ఆలోచనల్తో మునకలు వేయసాగేడు.

* * *

రెండురోజులు గడిచాయ్!

ఈ రెండు రోజులూ, స్వామి, మనోరమ సంగతే ఎత్తకపోవటం, రంగకు ఎలానో వుంది. తన మట్టుకు తనే ఆ విషయం ఎత్తడానికి నామోషి. అభిమానం దెబ్బ తింటుందనే అహం. కానీ, మనసులో ఏదో కూాల. తియ తీయని భావా లూరుతున్నాయి. ఎలా అయితేనేం, ఆ వేళ మరి మనసులో దాచుకోలేక, అహం చంపుకుని, షికారు టైములో—

'ఒరే! సంగతులే చెప్పడం మానేశావ్! విశేషాలేం లేవ్రా?' అడిగాడు. మనోరమ సంగతులేం చెప్పక పోతాడా - అనే ఆశతో స్వామి పరధ్యాన్నం నటిస్తూ- 'లేకేం? ఈ తెల్లవారుఝామున్రా మా ఎదురింటి గేదెకు అయిదు కాళ్ళ పడ్డ పుట్టింద్రా మరో విచిత్ర మేవిటంటావ్'

'...దాని సంగ తెవడికి కావాలోయ్ ఇంకేవయినా సరదా విషయాలు చెప్రా' సగంలోనే అందుకుని, ముఖం చిట్లించుకున్నాడు రంగ.

'...సరదా విషయాలంటే ఓ అదా? ఔనౌన్సునూ మొన్న అయిదు లక్షల మెజారిటీతో మన సర్వేపల్లి రాధాకృష్ణ భారత అధ్యక్షులైనారు. ఇది చాలా గొప్ప'

'...సర్లెవోయ్! మాలావు వార్తాహరుడివి వచ్చావ్. ఈ సంగతు లెవరి క్కావాలి. ఒరే మరి మరి'

'మరి ఏంట్రా చెప్పు సినిమా కెళ్దామా? భార్యాభర్తలు రెండోసారి' ఆశ కల్పించాడు స్వామి.

'ఎన్నిసార్లు చూస్తావోయ్ బోర్ అదికాదు మరి మరి మనోరమ.'

'ఓహో మనోరమా ఆ పిక్చర్ దీన్తర్వాతే వేస్తార్ట. నిన్ననే వీర చెప్పాడు. మనోరమలో తలత్ పాటలు యమ సుమా'

రంగ మరి రెసిస్ట్ చేసుకోలేకపోయాడు. భావోద్రేకంతో 'ఒరే మర్నన్ను చంపకురా! మన మనోరమ సంగతి సగంలోనే వదిలేశావ్. 'ఆ అమ్మాయి' అడిగినందుకే సిగ్గుపడిపోయాడు. అతని ముఖం అసలే ఎరుపేమో మరీ ఎర్రనైపోయింది.

స్వామి లోలోన ఆనందించాడు. అంత ప్రేమ ద్వేషి దానికి దాసీ అయి, దోషిలా ఎలా మారేడా - ని, ఆశ్చర్యపోయి, 'ఇది సహజం' అని నిర్ణయించుకుని-

'ఓహో! మనోరమ సంగతా! అంటే నీ ప్రేయసీ, నువ్వలా వుంటే, ఆమెపై నాకు కనేమో అనుకున్నాను?

'ఒరే! మరి నన్ను వేధించకు. ఎలాంటివాళ్ళైనా ఈ వలలో చిక్కుకోవల్సిందే! ప్రకృతిని జయించడం మనకేం చేతనౌతుంది? ఇనుపకచ్చడాల్ కట్టిన మునిముచ్చులే లొంగిపోతే,..మనఁవేమాత్రం? ముందేదో అలా ప్రవర్తించానేమో గాని, మనోరమగూర్చి ఇప్పుడు వేనేదో వ్యక్తం చేసుకోలేని బాధ అనుభవిస్తున్నాను. మగవాళ్ళను, ఆడవాళ్ళు తోలుబొమ్మలుగా చేసి, కళ్ళతోనే ఆడిస్తారు. నా తలంతా ఆదోలా అయిపోతోంది, దీన్ని ఏం బాధంటార్రా?...' పాపం జాలిగానే అడిగాడు చిన్నపిల్లాడిలా రంగ.

'. .ఇదా.. ఇదీ. .ఆఁ.,.విరహం. ,విరహం అని ఇదో రకం బాధలే. వయసులో వున్న అందరికీ సాధారణంగా వచ్చేజబ్బే ఇది ,.నీ తలంతా పాడైందన్నావు గాబట్టిన్నీ; నీకు 'జోరుగా హుషారుగా...' పాట ఎక్కువ ఇష్టం గాబట్టిన్నీ; భార్యాభర్తలు సినిమా కెళ్దాం. రా. కాస్త రిక్రియేషన్ గా వుంటుంది...' స్వామి సజెస్ట్ చేశాడు,

'...ఒరే...సినిమా వద్దు. ఇసినిమావద్దు..,మీ వైదేహినడిగి, మనోరమ వివరాలు సేకరించరా...బాబ్బాబు...



నీకు పుణ్యముంటుంది. ఇలా పూరించడం స్నేహ ధర్మం కాదు.

'మరి అన్ని పెద్ద కబుర్లెందుకు చెప్పావ్ ముందు? ప్రేమించిన వాళ్ళంతా రొదవలనే భావం వ్యక్తని చేశావ్! నీదాకావస్తే తగువులేదన్న మాట! సరే... దానికేం గానీ, నేను పిక్చర్ కెళ్తున్నాను. నువ్వు రెష్టు తీసుకో. ఇప్పుడు పిక్చర్ కి, మా వైదేహీ; మనోరమ వస్తున్నారు కాబట్టి, వాళ్ళతో వివరాలు మాట్లాడి, రేపుదయం సంగతులు చెప్తాను..' కొంటెగా ఆగి, విచిత్రంగా చూశాడు రంగ వేపు. స్వామి.

'ఆఁ...మనూ పిక్చర్ కి వస్తోందా? చెప్పావ్ కాదేం? కానీ, ఒరే భార్యాభర్తలు సినిమా యేం...ఎన్నిసార్లు చూసినా విసుగనిపించదు. పదపద...టైం కూడా ఐపోతోంది,..' తొందర చేశాడు రంగ.

'హుఁరా...' అనుకుని పుసుక్కున ముక్కున వేలే సేసుకున్నాడు స్వామి.

* * *

బాల్కనీలో మూడో వరుసలో మనోరమ, వైదేహీ కూర్చున్నారు. వాటి పక్క రెండుసీట్లు తప్ప మిగతా హాలంతా కిటకిటలాడుతోంది.

ఇది చూడగానే, స్వామి ఏర్పాటుకి రంగ ఆనందించాడు, అభినందించాడు కూడా మనసులో.

ముందు కుర్చీలో వైదేహీ, ఆతర్వాత మనోరమ కూర్చున్నారు. మనూ పక్కన జాగా వదిలి, స్వామి నాలుగో కుర్చీ ఆక్రమించాడు. విధిలేక (పైకి! కానీ మనసులో ఎంత పొంగిపోయాడో ఆ రంగధాముడికే తెలియాలి —) రంగ, మనూపక్క కూర్చున్నాడు. మనూ కూడా సరదాగానే ఆహ్వానించింది.

పిక్చర్ నడుస్తోంది.

మను మెల్లగా రంగని సంభాషణలోకి దింపింది.

'మీకు మన స్టార్స్ లో ఎవరంటే ఇష్టమండీ...'

'ఝమున..' తక్కున తడుంకోకుండా చెప్పేశాడు రంగ.

'అదికాదండీ... మేల్స్ లో...'

'అదా...నాగేశ్వరరావు...' చప్పగా చెప్పాడు.

'మీరు నాటకాల్లో......'

'...ఓ...వేశానండీ...ఎన్నో కప్పులూ...ఇవీ...అవీ...' ఆత్రంగా తన గొప్ప చెప్పసాగాడు.

'...అయితే నాలాగే మీకూ చాలా ప్రైజెస్ వచ్చాయన్నమాట...నాక్కూడా జమునా నాగేశ్వరరావు అంటేనే ఇష్టం స్మండీ' మెల్లగా, తీయగా అంది మను.

'బలే...మన ఇద్దరి అభిరుచులూ ఒక్కటేనన్న మాట..' చక్కని భావంతో మాట్లాడేనని లోలోన ఆనందించేడు.

'అవునుస్మండీ...నాకూ అదే తడుతోంది. మీ పూర్తి పేరు...'

'నా పేరాండీ...మా ఇంటిపేరు చంద్రగిరివారు. నా పేరు రంగనాధరావు. మీరు 'రంగా' అంటే చాలు...' తిరిగీ తన సమయస్ఫూర్తికి పొంగేడు రంగ.

'మీరూ, స్వామి స్నేహితుల్ట! వైదేహీ చెప్పింది. ఆవేళ మీరు షికారు వెడుతూంటే చూశాను. అదే రోజున మానాన్న నాకొక కవరు పంపేరు. నేనిక్కడ పి.యూ.సి. చదువుతున్నాను. మా మేనత్తింటోవుండి. ఆ కవర్లో ఇదుంది...చూడండి...ఈ ఫోటో ఎవరిదో...' చీకట్లోనే అందించింది మనూ.

రంగలో రకరకాల భావాలు, భయాలు మొదలసాగేయ్. సినిమా వెలుగులో ఆ ఫోటో చూసి—.

'హా రే...నాదే...ఈ ఫోటో నాదే...మీ కెలా వచ్చింది? బాఁవుంటుందని ఫుల్ సూట్ లో తీయించుకున్నాను...' బోల్డు ఆశ్చర్యపోతూ అడిగాడు, గుండె ఓ పక్క దడదడలాడుతున్నా.

'...మీ నాన్నగారు, మా నాన్నగారికి పంపితే, మా నాన్నగారు నాకు పంపేరు. ఇది పెళ్ళికుమారుని ఫోటో ...నాకు నచ్చింది...' విచ్చిన గులాబీలా తియ్యగా చెప్పింది మనోరమ.

రంగ ఏంచైవుంటాడో మీరే ఊహించండి!!

